కవితా కౌముది

మనిషి

మంజునాథ్

జీవితాన్ని అడిగాను—

"నిన్ను ఎప్పుడు అర్థం చేసుకోగలను?"

అది చిరునవ్వు నవ్వి
నిశ్శబ్దంగా చెప్పింది—

"నాలో సమాధానం వెతకకు.
ప్రతి ప్రశ్ననూ
నావైపు విసిరేంతవరకు
నేను నీకు పరాయినే.
ఒక రోజు
అదే ప్రశ్నను
నీలోకి తిప్పి అడిగినప్పుడు...
నన్ను కాదు,
నిన్నే కనుగొంటావు."

చాలా కాలం తర్వాత
నన్ను నేనే అడిగాను—

"అయితే...
నేనెవరు?"

సమాధానంగా
మౌనం వచ్చింది.

ఆ మౌనానికి
శబ్దం లేదు.
కానీ
శతాబ్దాల జ్ఞానం ఉంది.

అది మెల్లగా చెప్పింది—

"నువ్వు వెతుకుతున్న 'నీవు'
ఎప్పుడూ దూరం కాలేదు.
నీ ఆలోచనల కోలాహలంలో
నీవే కనిపించలేదు.
'నేను' అనే గోడ
కూలిపోయిన చోట—
మనిషి
మొదటిసారి
పుడతాడు."

★★★

అసలైన ఆస్తి

షేక్ నసిమాబేగం

నిన్నటి వరకు
మన కోసం తలుపులు
తెరిచిన ఇళ్లు,
రేపు మన పేరును
జ్ఞాపకాల అలమారలో
మడతపెట్టి ఉంచేస్తాయి.
వేళ్ల మధ్య జారిపోయే వెలుగులా
బతుకు కూడా ఆగదు...
అయినా
ఎదుటివాడి హృదయాన్ని
ముళ్ల కంచెగా మార్చుకోవడంలో
ఏ విజయం దాగి ఉంది?
చివరి శ్వాస
ఏ ఖాతా పుస్తకాన్నీ తిరగేయదు,
ఎన్ని మనసులను
తేలికపరిచావో మాత్రమే అడుగుతుంది.
కన్నీటి బరువును తూచే త్రాసు ఈ లోకంలో
లేకపోయినా,
మన వల్ల నవ్విన పెదవులే
మన బరువును కొలిచే కొలమానం.
కక్షలు కాలిపోయిన కాగితాల బూడిద.
ప్రేమ మాత్రం చిరునామా మారినా చేరే
ఉత్తరం.
చివరికి మనం తీసుకెళ్లేది
సంపాదించిన వస్తువులు కాదు
ఎవరి ప్రార్థనల్లో
మన పేరు మిగిలిందో
అదే మన అసలైన ఆస్తి.

★★★

నేస్తమయ్యే మనసు

కృష్ణ రవళి

నింగి నిండిన చుక్కలు చెమరించినా
రాలవు నీకోసం
తలపి వెన్నెల తరళించి నిను తాకినా
తట్టి మాటాడదు యుగాలు గడచినా.

రాలే ప్రతి చినుకూ నీ కంటినీరు కలుపుకుని
యేటివాలుగా సాగుతుందే కాని..
తెరపు పలకదు .

పూలగాలి నీ చెంప నెమిరి వయ్యారంగా
కదిలిపోతుంది నిలబడదు నీ కడ.

కానీ..వీటికావల యెప్పటికీ నీవైన
మనసుంటుంది పరిమళిస్తూ.
చేరువలూ దూరాలు దానికి తృణ మాత్రమే .
చెంగు చెంగున చైతన్యంచిందులాడుతూ
చేరుకుంటుంది నీ చేయందుకోను .

రూపంలేని మనసు చెప్పే ఊసుల సమూహం,
యేటొడ్డున నినుతాకే చిరు కెరటమై
నేదతీర్చే చల్లగాలై ..
వెన్నెల వీడై
వేసవి మల్లెల మాలై
నీకోసం నేనున్నానన్న పలకరింపై .
గుబాళిస్తుంది స్నేహమై ..
సలలేని నేస్తమై .!

★★★

రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎటుల వినిపింతునెవలికే పదమ్ము?
స్వాంతమునసుండునది వెలుపలికి రాదు
ఆత్మ కుహరాన మూర్ఛగుననవరతము
అంగమెల్ల వ్యాపించునహర్నిశమ్ము

తలుపు తట్టి నా మనస్సును పిలుచుచుండు
వెలువరింపమనుచు విన్నవించుచుండు
ఆత్మదేశపు భాషనెట్లనువదించి
బాహ్యలోకమ్మునకు నేను పంచగలను?

భావములు మెండు, నుడువగ భాష లేదు
పాటయున్నది పాడగ స్వరములేవి?
పదయుగమ్మిదె నడువగ బాట లేదు
కన్నులున్నవి చూడగ కాంతి లేదు

ఈ యశక్తత నాలోననేల కల్గె?
సర్వజనులకు తగదను సందియమ్మె!
వెలువడిన భావముడుగునన్ వెఱపు వలనొ!
ఎల్లలెఱుగని మదినెఱిగింపలేకొ!

అంతు లేనిది నా హృదయాంతరమ్ము
దాచుకొన్నది తనలోన ధరణినెల్ల
చేర్చుకొన్నది తనయందు సృష్టినెల్ల
ఏమి చెప్పుదునేటుల వర్ణింపగలను?

COMMENTS